RNI NO TGTEL/25/A3369

సమస్త ప్రక్షాళనం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 194 ఎడిటర్ : జె. భాస్కర్, గురువారం 12-11-2026 పేజీలు : 04 వెల : 2/-

తెలంగాణ నుంచి బయల్దేరిన


'కారు' ఢిల్లీకి చేరగానే 'కమలం' పువ్వుగా మారిపోతోంది

- బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి
- గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీకి రేవంత్ సవాల్
- పాతబస్తీ అభివృద్ధి, మూసీ నైట్ ఎకానమీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- ఏఐ ప్రభావం దృష్ట్యా నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని వెల్లడి



దేశంలో భారతీయ జనతా పార్టీని (బీజేపీ) సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా, బలం కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన 'జాతీయ విద్యా దినోత్సవం', 'మైనార్టీ సంక్షేమ దినోత్సవం' వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి బీఆర్ఎస్ మిత్రపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ గల్లీల నుంచి బయలుదేరే 'కారు' గుర్తు.. ఢిల్లీ చేరేసరికి బీజేపీ 'కమలం' పువ్వుగా మారిపోతోందని ఆయన చమత్కరించారు. కేంద్రంలో బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం కొనసాగిస్తోందని విమర్శించారు.

2



రైతులకు గుడ్ న్యూస్

- రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్రం ఆమోదం


- కేంద్ర మంత్రివర్గం బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది.
- ముఖ్యంగా రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపింది.

రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. అలాగే నార్త్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మార్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోటియా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్-అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు

మిగతా 2లో

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు..

- ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి
- రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు
- జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ
- ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి

మిగతా 2లో

ఆంధ్రాకు నీళ్లు తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు?



2లో

- నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్
- కృష్ణా, గోదావరి నీటిని ఏపీ ఎత్తిపోస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఉందని నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

నాయుడుపేటలో రూ.4 వేల కోట్లతో ఇండో-కొరియన్ బ్యాటరీ విడిభాగాల పరిశ్రమ

- తిరుపతి జిల్లా నాయుడుపేటలో భారీ బ్యాటరీ ప్రాజెక్ట్
- ఇండో కొరియన్ సంయుక్త భాగస్వామ్యంతో ప్లాంట్ ఏర్పాటు
- దాదాపు 5 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు
- 230 ఎకరాల విస్తీర్ణంలో మూడు దశల్లో నిర్మాణం
- పరిశోధనల కోసం ఐఐటీ తిరుపతితో కలవాలన్న నారా లోకేశ్



2లో

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు



2లో

- కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క
- సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం
- పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత
- ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య
- యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు





2లో

దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా నవీ ముంబయి

- లిస్ట్‌లో విజయవాడ, విశాఖ

- దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నవీ ముంబయికి మొదటి స్థానం లభించింది.
- రెండో స్థానంలో సూరత్, మూడో స్థానంలో విజయవాడ నిలిచాయి.

నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో నేనూ, రాహుల్ నయా పైసా తీసుకోలేదు

నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరణ ప్రక్రియ ద్వారా తాను కానీ, రాహుల్ గాంధీ కానీ ఒక్క పైసా కూడా తీసుకోలేదని సోనియా గాంధీ తెలిపారు.



2లో



2లో

రష్యా, ఉక్రెయిన్ చర్చల్లో కీలక పురోగతి

- యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు ఓకే!

- బుధవారం రష్యా, ఉక్రెయిన్ మధ్య జరిగిన చర్చల్లో ఇరుపక్షాలు కీలక ఒప్పందానికి వచ్చాయి.
- భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు పరస్పర అంగీకారం కుదిరింది.

తెలంగాణ నుంచి బయల్దేరిన 'కారు' ఢిల్లీకి చేరగానే 'కమలం' పువ్వుగా మారిపోతోంది

మైనార్టీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని సీఎం మండిపడ్డారు. పేద మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రద్దు చేయాలని బీజేపీకి ఏ దేవుడు చెప్పాడని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. మైనార్టీ రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న బీజేపీ.. చేతనైతే ముందుగా ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఆ రిజర్వేషన్లను రద్దు చేసి చూపించాలని ఆయన సవాల్ విసిరారు. పేదలకు, మైనార్టీలకు ఓటు హక్కు కల్పించి రాజకీయంగా బలోపేతం చేసింది కాంగ్రెస్ పార్టీ అయితే, బీజేపీ మాత్రం వారి హక్కులను కాలరాయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని సీఎం చెప్పారు. పాతబస్తీలోని సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులను ప్రభుత్వం శరవేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ద్వారా పాతబస్తీకి చారిత్రక పూర్వవైభవాన్ని తీసుకొస్తామని, మూసీ నదీ పరివాహక ప్రాంతంలో 'నైట్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

దేశంలో పారిశ్రామిక శిక్షణ సంస్థలకు (ఐటీఐ) మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాది వేశారని సీఎం గుర్తుచేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) అప్‌గ్రేడ్ చేసిందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత విస్తరిస్తున్న వేళ, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఏఐ రీప్లేస్ చేయలేని 'బ్లూ కాలర్' ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. సరైన నైపుణ్యాలు ఉంటే బ్లూ కాలర్ జాబ్స్ రంగంలో అవకాశాలకు కొరత ఉండదన్నారు. యువతలో నైపుణ్యాలు, క్రీడలను ప్రోత్సహించేందుకే ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'లను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించాలని, విద్యుతనే సమాజంలో మార్పు సాధ్యమని పిలుపునిచ్చారు.

రాజకీయంగానూ మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. గతంలో గులాం నబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు అనేక మంది నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించామని, ప్రస్తుతం మాజీ క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడంతో పాటు షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించామని గుర్తుచేశారు.

అంతేకాకుండా రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిన బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ వంటి మైనార్టీ క్రీడాకారులకు భారీ నగదు ప్రోత్సాహకాలతో పాటు గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను అందించి గౌరవించిన విషయాన్ని ప్రస్తావించారు.

ఆంధ్రాకు నీళ్లు తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతు సంక్షేమం కన్నా రాజకీయమే ముఖ్యమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో కేటీఆర్ ప్రసంగించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని పాలకులు తెచ్చిన కరవని ఆరోపించారు. పట్టిసీమ దగ్గర ఏపీ నీళ్లు ఎత్తిపోస్తుంటే, కన్నెపల్లి దగ్గర రేవంత్ ఎందుకు ఎత్తిపోయడం లేదన్నారు. ఆంధ్రాకు నీళ్లు, తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు, నీళ్లపై పట్టింపు లేదన్నారు.

రైతుల కన్నీళ్ల కంటే నా గడ్డం మీదే దృష్టి : కేటీఆర్

ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల కోసం కేసీఆర్ సదర్మాట్ డ్యాం కట్టినా కాంగ్రెస్‌కు, దాన్ని వినియోగించుకోవడం రావడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీళ్లు నిజాంసాగర్‌కు ఎత్తిపోస్తే, ఎల్‌నినో వచ్చినా ఇన్ని తిప్పలు వచ్చేవి కాదన్నారు. రైతుల కన్నీళ్ల కన్నా తన గడ్డంమీదే ముఖ్యమంత్రికి దృష్టి ఎక్కువగా ఉందని కేటీఆర్ ఆక్షేపించారు. ఎల్‌నినో గురించి సీఎం రైతులకు ధైర్యం చెప్పడం లేదని, కరోనా సమయంలో కేసీఆర్ అందరికీ అండగా నిలిచారని వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఊళ్లో నాటకాలు వేయాలని ముఖ్యమంత్రి చెప్తున్నారని, నాటకాలు, ఉపన్యాసాలతో రైతుల కడుపు నిండదన్నారు.

'కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో నాలుగున్నర లక్షల కోట్ల అప్పు'

ఆదిలాబాద్ జిల్లాలోని గూడేలను కేసీఆర్ గ్రామపంచాయతీలు చేశారని కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని 4.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చారన్నారు. తాము ప్రతి గ్రామానికో ట్రాక్టర్ కొనిస్తే, వాటికి డీజిల్ పోయడానికి కూడా కాంగ్రెస్‌కు చేతకావడం లేదన్నారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.5 లక్షల కోట్ల అప్పుచేసిందని ఆరోపించారు. అమ్మఒడి వాహనాలు, గర్భిణులు, బాలింతలకు ప్రసూతి సహాయం ఆపేశారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యా భరోసా ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేల కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ బాకీలుపెట్టారని ఆరోపించారు.

"ఇది దేవుడిచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు. ప్రకృతి తెచ్చిన కరవు కాదు. పాలకుల వికృతి తెచ్చిన కరవు. కృష్ణా, గోదావరి నదుల్లో వెయ్యి టీఎంసీల నీళ్లు రేవంత్‌రెడ్డి ఎత్తిపోయకుండా కిందకి వదిలిపెట్టారు. పట్టిసీమ దగ్గర నీళ్లను ఏపీ ఎత్తిపోస్తుంటే, ఇక్కడ కన్నెపల్లి, దేవాదుల వద్ద రేవంత్‌రెడ్డి ఎందుకు పంపులు ప్రారంభించలేదు. మన ప్రాజెక్టులు ఎందుకు ఎండాయి? ఆంధ్రా ప్రాజెక్టులు ఎందుకు నిండాయి? శ్రీశైలం నీటిని చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం వరకు తీసుకెళ్లారు. పక్కనే ఉన్న పాల మూరు రైతు పొలం ఎందుకు ఎండిపోతోంది? రేవంత్‌రెడ్డి మూడేళ్లలో రూ.నాలుగున్నర లక్షల కోట్లు అప్పు చేశారు. హైదరాబాద్‌లో ఇష్టారీతిన భూములు అమ్ముకుంటున్నారు. ఒక్క హామీ అమలు చేయకుండా నిధులు ఏంచేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి"

రష్యా, ఉక్రెయిన్ చర్చల్లో కీలక పురోగతి- యుద్ధ ఖైదీలను అప్పగించేందుకు ఓకే!

రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అబుదాబి వేదికగా జరిగిన చర్చల్లో కీలక ముందడుగు పడింది. అమెరికా మధ్యవర్తిత్వంతో రెండు రోజుల పాటు జరిగిన ఈ చర్చల్లో, భారీ స్థాయిలో యుద్ధ ఖైదీల మార్పిడికి ఇరు దేశాలు అంగీకరించినట్లు అధికారులు బుధవారం పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో అత్యంత భారీ స్థాయిలో యుద్ధ ఖైదీలను విడుదల చేసేందుకు అంగీకారం కుదరడం ఈ చర్చల్లో సాధించిన ప్రధాన సానుకూల పరిణామమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు, యూఎస్ ప్రతినిధి జారెడ్ కుష్నర్ తెలిపారు. విడుదల చేయనున్న ఖైదీల సంఖ్యను గురువారం ఖరారు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తదుపరి దౌత్యపరమైన చర్యల్లో భాగంగా కుష్నర్, అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్‌లు రేపు మాస్కో వెళ్లి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఆ తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమై, అబుదాబి చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన కీలక అంశాలను ఆయనతో పంచుకోనున్నారు.

దాదాపు ఐదేళ్లుగా కొనసాగుతున్న రష్యా- ఉక్రెయిన్ సంఘర్షణకు ముగింపు పలికేందుకు ట్రంప్ పరిపాలన తన దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. చర్చల అనంతరం అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ కలిసి గురువారం మాస్కోకు వెళ్లనున్నారు. యుద్ధ ముగింపు దిశగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ముఖాముఖి చర్చలు జరపనున్నారు. ఆ తర్వాత, ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం కానున్నారు. అబుదాబిలో రష్యా, ఉక్రెయిన్, అమెరికా ప్రతినిధి బృందాల మధ్య రెండు రోజుల పాటు చర్చలు జరిగిన నేపథ్యంలో బుధవారం ఈ ప్రకటన వెలువడింది. ప్రస్తుతం జరుగుతున్న ఈ చర్చలు మానవతా సహాయ చర్యలను వేగవంతం చేయడం, ఖైదీల విడుదల, చర్చల్లో యూరోపియన్ దేశాలను కూడా భాగస్వాములను చేయడంపై ప్రధానంగా దృష్టి సారిస్తామని కుష్నర్ తెలిపారు.

"నేను, స్టీవ్ గురువారం మాస్కోకు వెళ్లి అధ్యక్షుడు పుతిన్‌ను కలుస్తాం. ఈరోజు జరిగిన చర్చల గురించి ఆయనకు వివరిస్తాం. కొన్ని అంశాలపై మరింత పురోగతి సాధించేందుకు ప్రయత్నిస్తాం. అనంతరం ఐర్లాండ్‌లోని డబ్లిన్‌కు వెళ్లి, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి వివరాలు తెలియజేస్తాం. చర్చల్లో వచ్చిన ప్రతిపాదనలపై ఆయనతో మరింత లోతుగా చర్చిస్తాం."

'ఇంకా కొన్ని అంశాలపై భేదాభిప్రాయాలు ఉన్నాయి'

ఇదిలా ఉండగా, బుధవారం జరిగిన చర్చలు కేవలం రెండు గంటల లోపే ముగిశాయి. ఈ చర్చల అనంతరం రష్యా ప్రధాన ప్రతినిధి వ్లాదిమిర్ మెడిన్స్కీ మాట్లాడుతూ, మాస్కో తన పాత వైఖరిలోనే కొనసాగుతున్నట్లు సంకేతాలిచ్చారు. "కొన్ని అంశాలపై మాకు పరస్పర అవగాహన కుదిరింది. మరికొన్నింటిపై ఇంకా భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఈ చర్చలు కచ్చితంగా కొనసాగుతాయి" అని మెడిన్స్కీ అన్నారు.

నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో నేనూ, రాహుల్ నయా పైసా తీసుకోలేదు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాసిన తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' మార్కెట్లోకి విడుదలయ్యాక రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఎన్నో సంఘటనల గురించి తెలియని విషయాల గురించి సోనియా గాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఇందులో భాగంగానే సుదీర్ఘ కాలంగా నడుస్తున్న నేషనల్ హెరాల్డ్ కేసు గురించి కూడా సోనియా గాంధీ తన వైఖరిని పుస్తకంలో స్పష్టంగా వెల్లడించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1938లో ప్రారంభించిన నేషనల్ హెరాల్డ్ పత్రికను పునరుద్ధరించడం అవసరం అని తాము భావించామని తెలిపారు. అయితే ఈ నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరణ ప్రక్రియ (రివైవల్ ప్రాసెస్) ద్వారా తన కుమారుడు రాహుల్ గాంధీ కానీ, తాను కానీ ఒక్క పైసా కూడా లబ్ధి పొందలేదని తేల్చిచెప్పారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికార బీజేపీ ఆరోపణలు చేయడంతో పాటు దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు కూడా చేస్తోందని సోనియా విమర్శించారు.

బీజేపీ తన కుమారుడు రాహుల్ గాంధీని టార్గెట్‌గా చేసుకొని వేధించిన తీరును కళ్లారా చూడటం తన వల్ల కాలేదన్నారు. తన కుమారుడి ప్రతిష్ఠను మసకబార్చేందుకు పెద్ద ఎత్తున ఫండ్ క్యాంపెయిన్స్ నిర్వహించాయని, వెనుక ఎన్నో కుట్రలు జరిగాయని ఆమె ఈ పుస్తకంలో పేర్కొన్నారు. "1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన నేషనల్ హెరాల్డ్ పత్రిక కాలక్రమేణా నాణ్యతను కోల్పోవడం, పాఠకుల సంఖ్య తగ్గడంతో 2010లో లాభాపేక్ష లేని సంస్థగా పునరుద్ధరించాం.

అందులో బోర్డు డైరెక్టర్లుగా నేనూ, రాహుల్ లేదా మరే ఇతర డైరెక్టర్ పైసా కూడా లబ్ధి పొందలేదు. అయినా మాపై క్రిమినల్ కుట్ర కేసులు మోపి ఈడీ ద్వారా రోజుల తరబడి విచారణ పేరిట వేధించారు." తమపై కేసులు నమోదు చేయగా, 2015 డిసెంబరులో బెయిల్ కోసం కోర్టుకు హాజరైనట్లు సోనియా గాంధీ తెలిపారు. నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో ఈడీ మరో విచారణ ప్రారంభించిందని ఆరోపించారు.

12 ఏళ్లకుపైగా కొనసాగుతున్న ఈ వ్యవహారంపై ఇప్పటికీ కోర్టులో విచారణ జరుగుతోందని వివరించారు. రాహుల్ గాంధీపై 8 రాష్ట్రాల్లో 30 కిపైగా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని చెప్పుకొచ్చారు. కోర్టులు, న్యాయవాదుల చుట్టూ తిరిగేలా చేసి రాహుల్ రాజకీయ కార్యకలాపాలకు ఆటంకం కలిగించాలన్నదే దీని వెనుక ఉద్దేశం అని సోనియా పుస్తకంలో వివరించారు. అయితే ఆ ప్రయత్నాలేవీ రాహుల్‌ను రాజకీయంగా నిలువరించలేక పోయాయని అన్నారు. 2023లో కొన్ని మోసాలకు పాల్పడిన వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ వారిలో పలువురికి 'మోదీ' ఇంటిపేరు ఉందని వ్యాఖ్యానించగా రాహుల్‌పై కేసు నమోదైందని, రెండేళ్ల జైలు శిక్ష తీర్పుతో ఎంపీ నివాసాన్ని ఖాళీ చేసిన సందర్భాన్ని కూడా పుస్తకంలో గుర్తుచేసుకున్నారు. ఇదే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ కాళ్ల కింద నేల కదులుతోందని (పరిస్థితులు పూర్తిగా మారిపోయాయనే అర్థంలో), ఈ పాలన శాశ్వతంగా కొనసాగదని తాను నమ్ముతున్నట్లు బిలాంగింగ్ పుస్తకంలో సోనియా గాంధీ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే వారి అభద్రతా భావాన్ని స్పష్టంగా బయటపెడుతున్నాయని విమర్శించారు. "ప్రభుత్వం తన ప్రజాదరణ, అధికారం చెక్కుచెదరలేదని ప్రచారం చేసుకోవచ్చు. కానీ నా నమ్మకం ప్రకారం వారి అడుగుల కింద నేల జారిపోయింది. ప్రధాన మీడియా వారివైపే ఉన్నప్పటికీ, ప్రభుత్వ చర్యలే వారిలోని అభద్రతా భావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. నియంతృత్వ పాలనలు శాశ్వతంగా ఉండలేవు. అధికార దుర్వినియోగం అనివార్యమైన పరిణామాలకు దారితీస్తుంది.

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు..

పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్

సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు. జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు.

కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని తెలిపారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా 'వాటర్ రెగ్యులేటరీ కమిషన్' ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై ఈ కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దవచ్చన్నారు.

ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

నాయుడుపేటలో రూ.4 వేల కోట్లతో ఇండో-కొరియన్ బ్యాటరీ విడిభాగాల పరిశ్రమ

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తూ తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.4 వేల కోట్ల భారీ పెట్టుబడితో బ్యాటరీ ముడిపదార్థాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. భారత్‌కు చెందిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జక్రా), దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ సంస్థ కాస్మో ఏఎం అండ్ టీ (జూమీ ూవీడు) సంయుక్తంగా 'కార్బన్ కాస్మో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ ప్లాంట్‌ను నెలకొల్పనున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి నేరుగా ఉద్యోగాలు లభించనుండగా, మరో 3,500 నుంచి 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

230 ఎకరాల్లో మూడు దశల్లో నిర్మాణం

నాయుడుపేటలో 230 ఎకరాల విస్తీర్ణంలో దక్షిణ కొరియా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరిశ్రమను మూడు దశల్లో నిర్మించనున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఇతర అవసరాలకు వినియోగించే లిథియం అయాన్ బ్యాటరీల తయారీలో అత్యంత కీలకమైన ఫెరిక్ ఫాస్ఫేట్ లిథియం ఐరన్ ఫాస్ఫేట్ క్యాథోడ్ ముడిపదార్థాలను ఇక్కడ భారీ స్థాయిలో ఉత్పత్తి చేస్తారు.

మొదటి దశ కింద ఏటా 30 వేల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, 30 వేల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ సామర్థ్యంతో 2028 మధ్య నాటికి యూనిట్‌నుఅందుబాటులోకి తీసుకురానున్నారు. అనంతరం 2031 నాటికి మూడో దశను పూర్తి చేసి పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 1.8 లక్షల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, 1.8 లక్షల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ ఉత్పత్తి అవుతుంది. వీటిలో సుమారు 1.3 లక్షల టన్నుల ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సంబ ంధించి 2026 అక్టోబర్ 16న అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత నవంబర్ 6న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం లభించింది.

దిగుమతుల భారం తగ్గించే కీలక అడుగు

భాగస్వామ్య సంస్థ అయిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే విజయనగరం జిల్లా బొబ్బిలిలో కాల్సిన్డ్ పెట్రోలియం కోక్ తయారీ పరిశ్రమను విజయవంతంగా నడుపుతోంది. మరో భాగస్వామి కాస్మో ఏఎం అండ్ టీ సంస్థ బ్యాటరీ క్యాథోడ్ పదార్థాల తయారీలో ప్రపంచ ప్రసిద్ధి చెందింది. శామ్‌సంగ్ ఎస్‌డీఐ, ఎల్‌జీ ఎనర్జీ సొల్యూషన్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలకు ఈ సంస్థ ముడిపదార్థాలను సరఫరా చేస్తోంది. ఈ రెండు సంస్థల రాకతో దేశీయంగా బ్యాటరీల తయారీకి అవసరమైన ముడిపదార్థాల కొరత తీరడంతో పాటు, విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది.

ఐఐటీ తిరుపతితో భాగస్వామ్యంపై నారా లోకేశ్ సూచన

కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా బ్యాటరీ పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధిపై దృష్టి సారించాలని మంత్రి నారా లోకేశ్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. బ్యాటరీ క్యాథోడ్ నాణ్యత పరీక్షలతో పాటు, పాత బ్యాటరీల నుంచి విలువైన పదార్థాలను వెలికితీసే రీసైక్లింగ్ సాంకేతికతపై పరిశోధనల కోసం ఐఐటీ తిరుపతితో కలిసి ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. "కార్బన్ కాస్మో సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు స్వాగతిస్తున్నాం. భారత్--దక్షిణ కొరియా భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి బ్యాటరీ క్యాథోడ్ సాంకేతికత నాయుడుపేటకు రావడం శుభపరిణామం. దేశంలో బ్యాటరీల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాలో ఉన్న లోటును ఈ పరిశ్రమ భర్తీ చేస్తుంది.

రైతులకు గుడ్ న్యూస్

కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. వాటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

ముద్రా రుణాలు.. సూక్ష్మ పరిశ్రమల కోసం ఉద్దేశించిన 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్' (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని కేంద్ర కేబినెట్ మరో 5ఏళ్లపాటు పొడిగించింది. అంటే 2031 మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. పీఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు బ్యాంకులు, రుణ సంస్థలు ఏకంగా 60.36 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశాయి. వాటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు ఉంటుంది. బ్యాంకులు లేదా రుణ సంస్థలు ఇచ్చే ఈ రుణాలకు డిఫాల్ట్ (రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం) రిస్క్ లేకుండా సీజీఎఫ్ఎంయూ పథకం రక్షణ లభిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి రూ.5వేల కోట్ల మేర నిధులు కేటాయించేందుకు ఆమోదం లభించింది. దీని ద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రాయోజన రుణాలకు ఊతం లభిస్తుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ సీజీఎఫ్ఎంయూ అనేది ముద్ర యోజన రుణాల వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

స్టాండప్ ఇండియా.. కేంద్ర కేబినెట్ స్టాండప్ ఇండియా పథకం గడువును 2031 మార్చి 31 వరకు అంచే ఐదేళ్లపాటు పొడిగించింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)ల్లోని వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి, అలాగే వారిలో పారిశ్రామిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రానున్న 5ఏళ్లలో అదనంగా మరో 2.5 లక్షల మంది వ్యాపారవేత్తలకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. 2016 ఏప్రిల్‌లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు ఈ రుణాలు అందించారు. ఉత్పాదక, సేవా, వాణిజ్య రంగాలు లేదా వ్యవసాయ అనుబంధ రంగాల్లో సరికొత్త గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను స్థాపించడానికి గాను, ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ నుంచి కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ లబ్ధిదారునికి, కనీసం ఒక మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందించడమే లక్ష్యంగా ఈ స్టాండప్ ఇండియా పథకం పనిచేస్తుంది. తక్కువ వడ్డీకి ఇచ్చే ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల వరకు మారటోరియం పీరియడ్ ఉంటుంది. అయితే ఈ రుణాలను 7 సంవత్సరాల్లోపు పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణ మొత్తంలో 85 శాతానికి క్రెడిట్ గ్యారెంటీ లభిస్తుంది. దీని ప్రామాణిక గ్యారెంటీ ఫీజు 0.50 శాతంగా ఉంటుంది.

ఎరువుల సబ్సిడీ.. రబీ సీజన్ 2026-27 కోసం ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులకు రూ.62,370 కోట్ల సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ దీనిపై మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. అందుకే రైతులకు తగినంత ఎరువుల సబ్సిడీ ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. 50 కేజీల డీఏపీ (డై-అమ్మోనియం ఫాస్ఫేట్) బస్తా ధర మునుపటిలాగనే రూ.1,350

గవర్నర్ కోటాలో నీలం మధుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి



సమస్త ప్రక్షాళనం/ఐడీఏ బొల్లారం272ది డివిజన్ : ప్రజల్లో మంచి గుర్తింపు, ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ఉన్న నీలం మధుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధు ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణను, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యాన్ని గుర్తించి ఎమ్మెల్సీ పదవి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి మరింత బలం చేకూరుతుందని అన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా నీలం మధుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె విజ్ఞప్తి చేశారు.

చారిత్రత్మక వాసన్న(ఆసాని) కుంట కబ్జాలపై నీటి పారుదల ఎస్ఈ కి స్థానికుల పిర్యాదు



సమస్త ప్రక్షాళనంబొల్లారం 272డివిజన్ :-బోల్లారంలో చారిత్రాత్మక వాసన్న కుంట చెరువుని నాలుగు ప్రైవేటు పరిశ్రమలు అక్రమంగా ఆక్రమించి చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారని సదరు పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జిల్లా నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ను స్థానికులు కలసి వినతి పత్రం సమర్పించారు.కొన్నేళ్లుగా చెరువుల పరిరక్షణను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు తమ విధుల్లో విఫలమయ్యారని ఆరోపించిన గ్రామస్తులు,స్థానిక పర్యావరణం, భూగర్భ జలాలు మరియు శక్తి వనరుల పరిరక్షణ కోసం ఏకమై ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నామని, వెంటనే చెరువును సర్వే చేసి ఆక్రమణలను తొలగించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పిటిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చెరువుని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని చెరువులో కట్టిన అక్రమాల్ని గుర్తించి వెంటనే తొలిగించాలని డిమాండ్ చేసారు.

నవంబర్ 15న పటాన్చెరు సాకి చెరువు వేదికగా ఛట్ పూజ..

ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..

ప్రముఖ భోజ్పురి గాయకుడు రితేష్ పాండే,

గాయకురాలు కావ్య లతో సంగీత కచేరీ..

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్..



సమస్త ప్రక్షాళనం/ పటాన్చెరు నవంబర్ 15 ఆదివారం సాయంత్రం. పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు వేదికగా ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజను భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

మంగళవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఛట్ పూజ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత 15 సంవత్సరాలుగా పటాన్చెరు వేదికగా ఛట్ పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలతో పాటు సొంత నిధులతో ఉచితంగా చెరుకును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఉత్తర భారతీయుల సంక్షేమానికి నిరంతరం అండగా నిలుస్తూ.. వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజలతో సమానంగా అన్ని రాష్ట్రాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. ఛట్ పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ రామచంద్రా రెడ్డి, రాజు, సుధాకర్ గౌడ్, సంజయ్ సింగ్, టింకు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొంతపల్లి దుర్గమ్మ తల్లి బోనాల జాతర

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



సమస్త ప్రక్షాళనం జిన్నారం : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌తో కలిసి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని దుర్గమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, విజయలక్ష్మి,రాజశేఖర్, మురళి, పద్మ, జయపాల్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి,నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, వెంకట్ రామ్ రెడ్డి, హుస్సేన్, తుపాకుల రాజు, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, మహేష్, రమేష్,వినోద్ గౌడ్, శంకర్, నాగేష్ గౌడ్, చందు,కౌశిక్ గౌడ్, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటికో మనిషి ఊరుకో బండి15 నవంబర్ నలగొండకు రండి

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఎస్ రాజు 12 నవంబర్ 2026

నవంబర్ 15న బహిరంగ సభలో ప్రతి ఒక్క రైతు పాల్గొనాలి

కొండాపూర్ మండలంలోని తేర్పాల్ గ్రామంలో ఏఐకేసు జాతీయ మహాసభల గోడపత్రికను విడుదల చేసి తీర్పూర్ నుండి కొండపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య మాట్లాడుతూ నవంబర్ 15న నల్లగొండ పట్టణంలో జాతీయ మహాసభల సందర్భంగా బహిరంగ సభ కుకొండాపూర్ మండలంలో ప్రతి ఒక్క రైతు నల్లగొండకు రావాలి ఈ మహాసభలో దేశవ్యాప్తంగా రైతులు నల్గొండకు వస్తా ఉన్నారు కాబట్టి నల్గొండలో 1000 మంది ప్రతినిధులతో నాలుగు రోజులపాటు రైతువంగం ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించి భవిష్యత్తులో రైతన్న గానికి అండదండగా ఏఐకేఎస్ నిలబడతా ఉంది రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి స్వామినాథ సిఫారసులను అమలు చేయాలి రైతులకు సబ్సిడీ విత్తనాలు వ్యవసాయ పరికరాలు సబ్సిడీ ధర అందించాలి ప్రతి రైతుకు నెలకు పదివేల పెన్షన్ ఇవ్వాలి గత ప్రభుత్వాలు రైతులకు ఇచ్చినటువంటి వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి తప్పిపోయినటువంటి రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి ఎల్ఈనో ప్రభావం వల్ల రైతులు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి 50వేల నష్టపరిహారం ప్రభుత్వాలు అందించాలి భూములు కోల్పోతున్నటువంటి రైతులకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం కట్టించాలి భూమికి భూమి ఇల్లుకు ఇల్లు చెట్టుకి చెట్టు అనే చట్ట ప్రకారమే రైతుకు ఇవ్వాలి స్వంతంగా రైతుల చే భూములను లాక్కుంటే రైతుల పక్షాన తెలంగాణ రైతు సంఘం పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వాన్ని మెడలు వచ్చి రైతులకు న్యాయ జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాబురావు గ్రామ అధ్యక్షులు వెంకటేష్ మధుకర్ రాజు సుధాకర్ శీను రాజు తదితరులు పాల్గొన్నారు

సర్పంచు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

సమస్త ప్రక్షాళనం రాయికోడ్:ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బుధవారం రాయికోడ్ మండలం ఇటికేపల్లి గ్రామ సర్పంచ్ తమ్మలి రాజు ముదిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విఠల్,శంశోద్దీన్ పూర్ సర్పంచ్ నరేష్,మండల పార్టీ యూత్ అధ్యక్షుడు అంజి ముదిరాజ్,కార్యదర్శి శంకర్,మాజీ ఎంపిటిసి నిరంజన్,అభిమానులు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం..

ఐదుగురికి గాయాలు



సమస్త ప్రక్షాళనం రామచంద్రపురం/కొల్లూరు: ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఓఆర్ఆర్ పైనా ముత్తంగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఫార్చునర్ కారు (టిఎస్ 07 ఎఫ్ జెడ్ 8643) కొల్లూరు గ్రామ సమీపానికి చేరుకోగానే డ్రైవర్ అకస్మాత్తుగా ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా బ్రేకులు వేశాడు. దీంతో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న మారుతి బ్రెజ్జా కారు (టీఎస్ 09 ఈయు2598) అదుపుతప్పి ఫార్చునర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బ్రెజ్జా కారులో ప్రయాణిస్తున్న విట్టల్ రెడ్డి (47), స్వర్ణలత (37), ప్రసన్న (13), కరుణాకర్ రెడ్డి (11), వేదాన్ని (9) గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు, వాంగ్మూలం మేరకు ఫార్చునర్ కారు డ్రైవర్‌పై కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి..

మహిళలకు వైద్యుల సూచన



సమస్త ప్రక్షాళనం /జిన్నారం :-గుమ్మడిదల మండల పరిధిలో అనంతారం గ్రామంలో మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కొమ్ము శీను ప్రారంభించారు.

యూసి బెస్ట్ ఫౌండేషన్, ఏఐజీ హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం, గ్రాన్యూల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ మాట్లాడుతూ, 40 సంవత్సరాలు పైబడిన మహిళలందరూ ఈ ఉచిత పరీక్ష శిబిరంలో పాల్గొని రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన వైద్య చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు నాయని శ్రీనివాస్, సాయి కృపాలి, షరోత్, సి జి ఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, ఈవో సురేష్ యాదవ్,ఉపసర్పంచ్ యాదిరెడ్డి, వార్డు సభ్యులు మంగ, పావని భాస్కర్ గౌడ్, శిల్పా రాము, నాయకులు గోపాల్, మహేష్ యాదవ్, లక్ష్మణ్, రమణ, యాదగిరి, ఆంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం



సమస్త ప్రక్షాళనం కొల్చారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఉదయం పాఠశాలకు రాగానే అల్పాహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో చేపట్టిన అల్పాహార కార్యక్రమాన్ని కొల్చారం మండలంలోని కొంగోడు, నాయిని జలాల్పూర్ గ్రామాల్లో ప్రారంభించారు.కొంగోడు గ్రామ సర్పంచ్ దుబ్బగళ్ల స్వామి, నాయిని జలాల్పూర్ గ్రామ సర్పంచ్ దేవిసింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయమే పోషక విలువలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామేశ్వర ప్రసాద్, ప్రవీణ్, సిద్ధయ్య, ఉపసర్పంచులు సిద్ధిరాములు, వెంకట నరసింహులు, మండల నాయకులు గంపల లక్ష్మయ్య, కురుమ యాదగిరి, కొంగోడు అంగన్‌వాడీ టీచర్ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతులు లేకున్నా ఆగని వెంచర్ల దందా!



మల్కాపూర్‌లో నిబంధనలకు పాతర.. అధికారుల నిద్రావస్థ!

ప్రాథమిక అనుమతులతోనే ప్లాట్ల విక్రయాలు..

అనుమతి లేని ప్రహరీ గోడ నిర్మాణం!

రెండు నోటీసులకే పరిమితమైన పంచాయతీ కార్యదర్శి.. మూడో నోటీసు ఎందుకు జారీ చేయలేదు?

ప్రజావాణిలో ఫిర్యాదులు.. పత్రికల్లో వరుస కథనాలు.. అయినా అధికారుల చర్యలు శూన్యం!

ప్రజాప్రతినిధుల అండదండలా? అధికారులపై ఒత్తిళ్లా? జిల్లా యంత్రాంగం మౌనం వెనుక మర్మమేమిటి?

కొండాపూర్‌కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో ప్రైవేట్ వెంచర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. వెంచర్ల నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అనుమతులకు మించి నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హెచ్‌ఎండిఏ నుంచి కేవలం ప్రాథమిక అనుమతులు మాత్రమే పొందిన రెండు ప్రైవేట్ వెంచర్లలో పూర్తిస్థాయి అనుమతులు రాకముందే పనులు కొనసాగించడంతో పాటు ప్లాట్ల విక్రయాలు సైతం చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమతి లేకుండానే ప్రహరీ గోడ నిర్మాణం!



మల్కాపూర్ గ్రామ శివారులోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో హెచ్‌ఎండిఏ నుంచి ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకుండానే వెంచర్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టి దాదాపు పూర్తి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చుట్టుపక్కల రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉండటంతో ఈ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతుల పరిస్థితిని పరిశీలించి నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్రోచర్లు సిద్ధం.. ప్రాథమిక అనుమతులతోనే ప్లాట్ల విక్రయాలు!

మరో వెంచర్‌లోనూ పూర్తిస్థాయి అనుమతులు రాకముందే బ్రోచర్లు సిద్ధం చేసి ప్లాట్ల విక్రయాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 50 శాతం ప్లాట్లు విక్రయించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. వెంచర్‌కు అవసరమైన అన్ని అనుమతులు వచ్చాయా? లేక ప్రాథమిక అనుమతుల ఆధారంగానే కొనుగోలుదారులకు ప్లాట్లు విక్రయిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పూర్తి అనుమతులు లేకుండా విక్రయాలు చేపడుతున్నట్లయితే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


రెండు నోటీసులకే పరిమితమైన పంచాయతీ కార్యదర్శి!

వెంచర్లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. వివిధ వార్తాపత్రికల్లో సైతం ఈ వ్యవహారంపై కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రజావాణిలో కూడా ఫిర్యాదులు అందించినప్పటికీ పంచాయతీ అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రెండు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతుండగా మూడో నోటీసు జారీ చేయకపోవడం వెనుక అంతర్యమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇవ్వడానికే పరిమితమవుతారా? లేక నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా పంచాయతీ అధికారికి తెలిసినా చర్యలు లేవా?

ఈ వెంచర్ల వ్యవహారం జిల్లా పంచాయతీ అధికారి స్థాయి వరకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల వరకు విషయం తెలిసినా నిర్మాణాలు





మాత్రం ఆగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయా? అధికారులపై ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి!

వెంచర్ల ప్రారంభ దశలోనే అధికారులు అప్రమత్తమై ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి మల్కాపూర్ గ్రామ శివారులోని రెండు వెంచర్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. హెచ్‌ఎండిఏ అనుమతులు, పంచాయతీ అనుమతులు, ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాట్ల విక్రయాల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అనుమతులు లేని నిర్మాణాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిన అధికారుల పాత్రపైనా విచారణ జరిపించాలని, రైతుల వ్యవసాయ భూములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు.. ఫిర్యాదులు అందుతున్నాయని సమాచారం.. పత్రికల్లో కథనాలు వస్తున్నా స్పందన కరువైతే ఇక సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? నిబంధనలు ఉల్లంఘించే వెంచర్లకు అడ్డుకట్ట వేసేది ఎవరు? జిల్లా కలెక్టర్ స్పందించి అధికారుల నిర్లక్ష్యానికి తెరదించుతారా? లేక అక్రమ నిర్మాణాలకు అండగా మౌనం కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే!

అసైన్డ్ భూముల రహస్య సర్వే వెనుక అసలు కథేంటి?

అధికారులా..? రాజకీయ నాయకులా..? కొండాపూర్ మండలాన్ని నడిపిస్తున్నదెవరు?

రైతులకు పరిహారం పూర్తిగా అందకముందే ప్రైవేట్ సర్వేలు.. గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండానే రహస్య వ్యవహారం..

అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు, రైతులు



కొండాపూర్ కొండాపూర్ మండలంలో అసైన్డ్ భూముల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ భూముల సేకరణ నుంచి సర్వేల వరకు అధికారుల పాత్ర ఏమిటి? రాజకీయ నాయకుల జోక్యం ఎంతవరకు ఉంది? అసలు మండలాన్ని నడిపిస్తున్నది అధికారులా? లేక అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మండలంలోని అన్ని శాఖల వ్యవహారాల్లో సదరు నాయకుడి జోక్యం కొనసాగుతోందని, సంబంధం లేని వ్యవహారాల్లోనూ పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూములను టీజీఐఐసీ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం సేకరించింది. అయితే భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పూర్తిస్థాయిలో అందిందా? రైతుల ఖాతాల్లో పూర్తి నగదు జమ అయిందా? భూములకు సంబంధించిన పట్టా, పరిహార ధ్రువపత్రాలు రైతులకు అందించారా? అనే అంశాలపై ఇప్పటికీ స్పష్టత రావాల్సి ఉంది. రైతులకు పూర్తి న్యాయం జరగకముందే భూముల వద్ద సర్వేలు నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రెవెన్యూ అధికారుల సహకారంతో సంయుక్త సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రైవేట్ వ్యక్తులతో రహస్యంగా సర్వే చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? చుట్టుపక్కల ఉన్న పట్టా రైతులకు, అసైన్డ్ భూముల రైతులకు కనీసం సమాచారం ఇవ్వకుండా, గ్రామ ప్రజాప్రతినిధులకు సైతం తెలియజేయకుండా సర్వే నిర్వహించడం వెనుక ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ భూముల సేకరణ, పరిశ్రమల ఏర్పాటు వంటి కీలకమైన వ్యవహారాల్లో పారదర్శకత పాటించాల్సిన అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. అసలు ఈ ప్రైవేట్ సర్వేకు అనుమతి ఎవరిచ్చారు? ఏ అధికారి ఆదేశాలతో సర్వే చేపట్టారు? సర్వే నిర్వహించిన వారి వద్ద అధికారిక పత్రాలు ఉన్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

ఈ క్రమంలో ప్రైవేట్ సర్వే నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులతో పాటు రైతులు సర్వేను అడ్డుకున్నారు. రైతులకు పూర్తి పరిహారం అందించకుండా, సంబంధిత భూముల వివరాలను బహిర్గతం చేయకుండా సర్వేలు ఎలా నిర్వహిస్తారని వారు నిలదీశారు.

మండలాన్ని శాసిస్తున్నదెవరు?

అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మండలంలోని వివిధ శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత గ్రామానికి, భూములకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా అసైన్డ్ భూముల వ్యవహారంలోనూ ఆయన పెత్తనం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్నారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా? అన్న చర్చ మండలంలో జోరుగా సాగుతోంది.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి మునిదేవునిపల్లి సర్వే నంబర్ 92లో నిర్వహించిన ప్రైవేట్ సర్వేపై విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సర్వేకు సంబంధించిన అనుమతులు, అధికారిక ఆదేశాలు, భూసేకరణ రికార్డులు, రైతులకు చెల్లించిన పరిహారం వివరాలను బహిర్గతం చేయాలి. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, రాజకీయ జోక్యానికి తావులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.రైతుల భూముల వ్యవహారంలో రహస్యాలెందుకు? అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేంటి? ఈ ప్రశ్నలకు జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెబుతారా? వేచి చూడాల్సిందే!

నేడే కొండాపూర్ మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం ఎంపీడీవో సోమశ్రీ



సమావేశానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ అశోక్ ఎంపీడీవో సోమశ్రీ ముఖ్యమైన అధికారులు ఉంటారు

సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ ఎస్ రాజు 12 నవంబర్ 2026 కొండాపూర్ మండల సాధారణ సమావేశానికి 15 శాఖల అధికారులు పూర్తి సమాచారాన్ని



తీసుకొని రావాలి 24 గ్రామాలకు సంబంధించిన సమాచారం ఉండాలి 24 గ్రామపంచాయతీల సర్పంచులు కొండాపూర్ మండలం అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు అన్ని శాఖల అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ఆ సమస్యలన్నిటిని నా దృష్టికి తీసుకురావాలని ఆమె అధికారులకు సూచనలు ఇచ్చారు ఈ సమావేశం 12 నవంబర్ 2026 న ఉంటుందని సమయం 11 గంటలకు ఉంటుందన్నారు ఈ సమావేశాన్ని అందరూ అధికారులు నాకు కలిసికట్టుగా గ్రామాలలో తెలిసేలా చెప్పాలన్నారు

బహుజనుడంత ఐక్యమత్యంగా ఉండాలి టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా అంబేద్కర్ భవనంలో కరపత్రం విడుదల

సంగారెడ్డి అంబేద్కర్ భవన్లో 8 నవంబర్ 2026 నా జరిగే జిల్లా సదస్సును విజయవంతం చెయ్యాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు

సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ ఎస్ రాజు 12 నవంబర్ 2026సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ు + × × ు చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి చేతులమీదుగా డిసెంబర్ /08/12/2026 సంగారెడ్డి లోనీ అంబేద్కర్ భావన్లో భారత రాజ్యాగం బహుజనుల ఐక్యత కై నిర్వహించే సభకు సంబశీదించిన కరపత్రం తూర్పు నిర్మల జగ్గారెడ్డి గారు తన నివాసం లో విడుదల చేయడం



జరిగింది ఇటీ కార్యక్రమని ఉదేశించి మాట్లాడారు జిల్లా వ్యాప్తంగా ఉన్న మేధావులు రచయితలు కవులు అంబేద్కర్ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం లో నిర్వకులు బహుజనచైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఎర్రారం దేవదాస్ బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాట్ గోవర్ధన్ గారు మరియు మల్కాపూర్ ఎంపిటిసి శ్రీనివాస్ గౌడ్ మల్కాపూర్ ఉపసర్పంచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి కుమారుడు భారత్ సాయి రెడ్డి (దత్తు) వివాహ వేడుకల డాక్టర్ మహేశ్వర సిద్ధాతి పరిశీలించారు



సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఎస్ రాజు 12 నవంబర్ 2026 డాక్టర్ మహేశ్వర సిద్ధాంతి పర్యవేక్షణలో పెళ్లి ప్రాంగణం మరియు వేదికను పరిశీలించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ



నాయకులు భరత్ సాయి రెడ్డి వివాహానికి కచ్చితంగా రావాలని కోరుకుంటున్నారు కార్యకర్తలకు వివాహ పత్రికలను సకాలంలో అందజేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగింది.



ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వర సిద్ధాంతి తోపాజీ అనంతకృష్ణ శ్రీహరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.